# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి అందించే పద్మ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు**

**2. ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు.**

**3. నాల్గవ విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు తెలంగాణలో పర్యటిస్తారు.**

**4. విశాఖపట్నంలోని సింహాచలం పై కొలువై ఉన్న శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వారి చందనోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

**5. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికల పోలింగ్ దృష్ట్యా రైళ్లకు అదనపు కోచ్ లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.**

==========================

పద్మ అవార్డుల ప్రదానోత్సవం రెండో విడత కార్యక్రమం నిన్న ఘనంగా జరిగింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా తెలుగు చలన చిత్ర నటులు చిరంజీవితో పాటు ప్రఖ్యాత నృత్యకారిణి, సీనియర్ నటీమణి వైజయంతిమాల బాలికి పద్మ విభూషణ్ పురస్కారాలన్ని ప్రదానం చేశారు. అలాగే సుప్రీంకోర్టు తొలి మహిళా జడ్జి దివంగత ఎం.ఫాతిమా బీబీ, హోర్ముస్‌జీ ఎన్.కామా పద్మభూషణ్ అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తో పాటు పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నెల 13న జరిగే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల డీఈవోలను, ఎస్పీలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. నిన్న వెలగపూడి సచివాలయం నుండి డిజిపి హరీష్ కుమార్ గుప్తాతో కలసి ఎన్నికల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించాలన్నారు. ఎన్నికలను

సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో పోలింగ్‌కు దూరంగా ఉన్న గ్రామస్తులను తరలించేందుకు రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

డిజిపి హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ పోలీసు అధికారులు శాంతి భద్రతల పరిరక్షణకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సూక్ష్మప్రణాళిలను రూపొందించుకుని అమలు పరచాలని ఆదేశించారు. ఎన్నికల సమస్యలపై సకాలంలో స్పందిస్తూ, సరైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

---------------------------

ఆరవ విడత లోక్ సభ ఎన్నికలలో ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 58 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఈనెల 25వ తేదీన ఎన్నికల జరగనున్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు ఈరోజు చివరి తేదీ. ఈ విడతలో ఢిల్లీలోని 7 స్థానాలు, హర్యానా 10, ఉత్తర ప్రదేశ్ 14, బీహార్, పశ్చిమ బెంగాల్లో చెరో 6 స్థానాలు, ఒడిశాలో 6, ఝార్ఖండ్ లో 4, జమ్మూ కాశ్మీర్‌లో ఒక స్థానంలో ఎన్నికలు జరుగుతాయి. కాగా ఓట్ల లెక్కింపు వచ్చే నెల నాలుగవ తేదీన జరుగుతుంది.

---------------------------

నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నామినేషన్ల గడవు నిన్నటితో ముగిసింది. ఈ రోజు నుంచి నామినేషన్ల పరిశీలన ప్రారంభం అవుతుంది. 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని అధికారులు తెలిపారు. ఉప ఎన్నికకు మే 27న ఉదయం ఎమ్మెల్సీ పోలింగ్ జరగనుండగా, జూన్ 5న కౌంటింగ్ జరగనుంది.

---------------------------

నాల్గవ విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు తెలంగాణలో పర్యటిస్తారు. ఈ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు నారాయణపేటలో జరిగే ర్యాలీలో ఆయన పాల్గొంటారు. సాయంత్రం హైదరాబాద్‌లోని ఎల్బీ క్రీడా మైదానంలో భారతీయ జనతా పార్టీ నిర్వహించే ఎన్నికల భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. కాగా, ప్రధానమంత్రి బహిరంగ సభ సందర్భంగా పోలీసులు ఈ రోజు హైదరాబాద్ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎల్బీ స్టేడియం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

---------------------------

దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని బీజేపీ నాయకులు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణాలో మెజారిటీ స్థానాలకు తమ పార్టీ అభ్యర్థులు గెలిచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణాలోని భువనగిరిలో నిన్న నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతోనే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. భువనగిరి నుంచి భూపాలపల్లి వరకు జాతీయ రహదారి నిర్మించామని, బీబీ నగర్‌లో ఎయిమ్స్ నిర్మించి పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. జనగామ నుంచి భువనగిరి వరకు రైల్వే లైన్ల ఆధునికీకరణ చేపట్టామని, కొమురవెల్లిలో అత్యాధునిక రైల్వే స్టేషన్ నిర్మిస్తున్నామని తెలిపారు.

---------------------------

దేశంలో అన్ని వర్గాలకు మేలు చేసేలా కాంగ్రెస్ మేనిఫెస్టోను రూపొందించామని కాంగ్రెస్ పార్టీ నాయకులు

రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణలోని మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిన్న నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించేందుకు పథకాలను రూపొందించామన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ పేరును ఎంపిక చేసి వారి బ్యాంకు ఖాతాలో నగదుని జమ చేస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్యం తదితర కుటుంబ ఖర్చుల కోసం వారికి ప్రతి నెలా 8,500 రూపాయలను అందిస్తామని రాహుల్ గాంధీ తెలిపారు.

---------------------------

కాగా.. న్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ రేపు వైయస్సార్ కడప జిల్లాలో పర్యటిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కడప లోక్ సభ నియోజకవర్గం పార్టీ అభ్యర్థి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల తరపున కడప నగరంలోని స్థానిక మైదానంలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు ఆంధ్రప్రదేశ్ లోని మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారు. ఈరోజు గుంటూరు పార్లమెంట్ పరిధిలోని మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్‌లో జరిగే ప్రచార సభలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని నగరి నియోజకవర్గం పుత్తూరులోని కార్వేటి నగరం రోడ్ సర్కిల్‌లో జరిగే సభలో పాల్గొంటారు. ఆ తర్వాత కడప పార్లమెంట్ పరిధిలోని కడప నగరం మద్రాస్ రోడ్ శ్రీ పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో జరిగే ప్రచార సభలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

మరోవైపు నిన్న అన్నమయ్య జిల్లా రాజంపేట రైల్వే కోడూరు రోడ్డులో జరిగిన ప్రచార సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, త్వరలో జరగబోయే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు. రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని, రాజంపేటలో పింఛా డ్యాం ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి చేశామని తెలిపారు.

---------------------------

సంక్షేమం, అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణే ఎన్డీఏ కూటమి లక్ష్యమని తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రజల జీవితాలు మార్చేందుకే సూపర్ సిక్స్ పేరుతో సంక్షేమ ప్రణాళికను ప్రజల ముందుకు తెచ్చామని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే బాధ్యత కూటమిదేనని అన్నారు.

---------------------------

వైశాఖ శుద్ధ తదియని పురస్కరించుకుని విశాఖపట్నం జిల్లా సింహాచలం పై కొలువై ఉన్న శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి స్వామి వారి నిజరూప దర్శనాన్ని కల్పిస్తున్నారు. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి తెల్లవారుజామున ఒంటి గంట నుంచి దేవస్థానం అర్చకులు వైదిక కార్యక్రమాల నిర్వహించారు.అర్చకులు స్వామి వారిపై ఉన్న చందనాన్ని వలిచి నిజరూపానికి తీసుకువచ్చారు చేస్తారు. అనంతరం ఉదయం నాలుగు గంటల నుంచి భక్తులను

దర్శనానికి అనుమతిస్తారు. ఈ రోజు రాత్రి తొమ్మిది గంటల సమయంలో సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారికి తొలి విడతగా  120 కిలోల చందనాన్ని సమర్పిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైళ్లకు అదనపు కోచ్ లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. తెలుగు రాష్ట్రాల మధ్య సేవలందించే  20కి పైగా రైళ్లకు తాత్కాలికంగా అదనపు బోగీలు ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈరోజు నుంచి మే 14 వరకు ఆయా రైళ్లలో థర్డ్ ఏసీ, సెకెండ్ ఏసీ, స్లీపర్, చైర్ కార్ అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అలాగే అలాగే సికింద్రాబాద్ కాకినాడ కాకినాడ సికింద్రాబాద్ల మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు తెలిపారు.

---------------------------

ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో  ఈరోజు రేపు  కూడా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం, శ్రీకాకుళం, కాకినాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, ఏలూరు, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని  తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశముందని తెలిపింది. అన్నమయ్య జిల్లా, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయనిపేర్కొంది.  తెలంగాణ వ్యాప్తంగా నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి,  జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

=====================